(యువ; మాసపత్రిక - నవంబర్ 1978
చక్రపాణి అవార్డు, రెండో బహుమతి)

మనోధర్మం

"ఒక్కసారి—." అక్కడికి మాట విరిచేడు రామం.

సరస్వతి మాట్లాడలేదు.

"భోజనానికి రమ్మంటున్నాడు" మళ్ళీ మాట విరిచేడు.

మళ్ళీ సరస్వతి మౌనమే.

"అన్ని విధాలా పెద్దవాడు.... వెళితే యేం అనిపిస్తున్నాది, నాకు!" మాట పూర్తిచేసేనని తెలికపడీకూడా, సరస్వతి రియాక్షన్ తెలిస్తే సమాధానమే కనక. అందుకోసం ఆగాడు రామం.

కనీసం సరస్వతి మొహం కనబడినా బావుణ్ను.... అనుకున్నాడు.

అతని రొమ్ముమీద వొత్తుగా పెరిగిన చోట దాక్కొనుంది ఆమె మొహం, ఆ క్షణంలో. అసలేం కనబడదు; అతనిక్కాని, ఆమెక్కాని.

ఐతే సమాధానం దొరికినట్టే అనిపించింది రామానికి—అతని వీపుచుట్టూ వున్న ఆమె చేతులు గట్టిగా బిగుసుకున్నాయి—అంటే—?

—మళ్ళీ మొదటికొచ్చింది కథ.

* * *

"ఎలా వుంది ఉద్యోగం?" అని పదహారు రోజుల క్రిందట వో సాయంకాలం తన రూమ్‌లో కెళిపోతూ రామాన్ని పలకరించేడు మేనేజింగ్ డైరెక్టర్ వాసవ.

"ఏదో సార్, తమ దయవల్ల." అంటూ వెనకాలే వెళ్ళి ఆయన గదిలో ప్రవేశించాడు రామం.

"నాన్సెన్స్, నా దయేమిటి? అలా ఎప్పుడూ అనొద్దు. నీకేం? తెలివైనవాడివి; సమర్థుడివి!" అన్నాడు వాసవ. "కూర్చో!"

కూర్చో కూడదేమో-

"సరేకాని? క్లాస్‌వన్ ఆఫీసర్ పోస్టొకటి శాంక్షనైంది, చూసేవా?"

"నేను అప్లయ్ చేశాన్సార్"

"ఐసీ.... నేనింకా చూశ్చేదు. లాస్ట్ డేటు యింకా వుందనుకుంటాను, కదు?.... కూర్చోవేం?"

"ఫరవాలేద్సార్."

"నోనో, వాటీజిట్!" అని వాసవ లేచి, రామం కూర్చునేటట్లుగా వొక అంగికం చేశాడు. దాంతో రామానికి కూర్చోక తప్పింది కాదు.

ఓ నిముషంపాటు వాసవ మాట్లాడకుండా ఏవో కాగితాలు చూస్తూ కూచు న్నాడు, అతని చేతినున్న ఖరీదైన చిత్రమైన గడియారం వేపు చూస్తూ రామం కూడా మాట్లాడకుండా వూరుకున్నాడు. తనూ గడియారంవేపు చూసి వాసవ "ఓ! ఏడుగంటలు కావస్తోందే, టయిమ్!" అన్నాడు.

రామం కుర్చీలో యిబ్బందిగా కదిలి, "నే వెళ్తాను సర్. తమకేదైనా పనుందేమో" అన్నాడు.

"నాటెటాల్!" అని, కుడిచేత్తో అతన్ని లేవవద్దని సంజ్ఞకూడా చేసి, ఆ చేతిని తన కణత మీద పెట్టుకున్నాడు వాసవ. పది సెకండ్లలాగే వుంచి, కూర్చునే వెనక్కి తిరిగి అందుబాట్లో వున్న అద్దాల బీరువా తలుపు జరిపి, ఒక్క క్షణం దృష్టి సారించి చూసి అందులోంచి రెండు పుస్తకాలు లాగాడు. వాటిని చిన్న చప్పుడుతో రామం యెదటికి విసిరి "ఇవి చూడు; నీకు పనికొస్తాయి" అన్నాడు.

కంపెనీల చట్టానికి సంబంధించి జాతీయస్థాయిలో ముఖ్యమైన కొన్ని కేసుల వివరాలు, వాటి మీద తీర్పుల సారాంశాలు- వొక పుస్తకం. బిజినెస్ మేనేజ్‌మెంట్ మీద, ప్రపంచం మొత్తం మీద మేధావులనిపించుకున్న వాళ్ళు రాసిన వ్యాసాల సంకలనం రెండో పుస్తకం.

'థాంక్యూ, సర్!' అన్న రామం మాటని వాసవ మాట మింగేసింది.

"సో.... హవార్యు?"

"ఫైన్, సర్."

"అండ్ యువర్ మిసెస్?"

"ఒ. కె. సర్."

"పిల్లల్లేరుగా?"

"లేరు సర్"

"నీకు తెలుసా...." అని, కొంచెం ఆలోచించి, "సరస్వతి మా వూర మ్మాయే.... నాకా అమ్మాయి ఇంతప్పట్నించి తెలుసు!"

"అలాగా సార్? నా కెప్పుడూ చెప్పలేదే, తను!"

"వాళ్ళ ఫాదర్ మా యింటి కెదురుగా వుండేవారు. ఈ కంపెనీలో నేను డైరెక్టుగా బిజినెస్ మేనేజరుగా సెలక్టయ్యాను; నీకు తెలుసో లేదో! అప్పుడా వుద్యోగపు మొదటి నెల జీతంలో, నేను మా వూరెళ్ళినప్పుడు- మా వీధిలో వున్న ప్రతి ఒక్కరికి ఏదో ఒక ప్రజెంటేషన్ చొప్పున పట్టుకెళ్ళాను. మీ మిసెస్- అదే సరస్వతి, అప్పటికి తొమ్మిదేళ్ళ పిల్ల."

"ఆయ-"

"నేనామెకి ఏం కొనిచ్చుంటానో వూహించగలవా!" తియ్యగా నవ్వాడు వాసవ.

—ఒక చాక్లెట్ మొదలు. ఒక రేడియోగ్రామ్ వరకు, ఏం కొని ఇచ్చినా ఇచ్చుండొచ్చు. కాని. పదిహేనేళ్ళనాటి వాత్సల్యం ఇప్పుడతని మొహంలో కనబడింది రామానికి.

"—పోనీ, సరస్వతి బాగా పాడుతుందని తెలుసుగా, నీకు?"

"తెలుస్సార్! అందుకేగా నేనామెని మేరేజీ చేసుకున్నది!" అని తేలిగ్గా, హాయిగా నవ్వాడు రామం.

"ఐ నో-! అప్పుడు నేనామెకి వొక తంబురా కొనిచ్చేను! పూర్ గర్ల్! మంచి కంఠంతో. అద్భుతంగా-బాలవేత్తలా. కాకపోతే బ్రహ్మవేత్తలా పాడేసేది! కాని శ్రుతి చేసుకోడానికి తంబురాకూడా కొనిపెట్టలేకపోయారు, వాళ్ళ ఫాదరు!....ఆయన పేదరికం వల్ల ఆ అమ్మాయి ప్రతిభ అణగారిపోకూడదని మనసారా అనుకుని, ఎనభై రూపాయలు పెట్టి కొన్నానా తంబురా!"

"అందుకు మిమ్మల్ని నేనుకూడా, ఇప్పుడు తెలిసింది కనక యిప్పుడైనా సరే, థాంక్ చెయ్యాలి సర్" అని పరమానందంతో చెప్పాడు రామం.

"నా బెటాల్!"

"తరవాతండి, అప్పట్నుంచి యిప్పటికీ, ప్రస్తుతంకూడా సరస్వతి సాధన చేసేది ఆ తంబురా శ్రుతితో నేనండి! నాకిప్పుడు తడ్తోంది?"

"వండర్ఫుల్!" అని సంతోషపడ్డాడు వాసవ, "కచేరీలు చేస్తోందిగా!"

"ఔనుసార్, మొన్న హైదరాబాదు స్టేట్ గవర్నమెంటు ఎరేంజ్ చేసిన సంగీత సమ్మేళనంలో తను కూడా పాడింది."

"అందులో ప్రత్యేకత యేం లేదంటాన్నేను. అందువల్ల గవర్నమెంటుకి

ఖ్యాతీ ఆడియన్సుకి తృప్తి వొచ్చుండొచ్చుగాని ఆమెకి పెద్దగా వొంగిందేం లేదనే నా ఉద్దేశం. అఫ్‌కోర్స్, నాకు సంగీతంలో వోనమాలు రావు. కాని నా ఉద్దేశం మాత్రం అదే!"

"మీ కాంప్లిమెంటుకు థాంక్స్ సర్"

"కీప్ దేస్ ఐ డోన్ట్ సీహర్- ఇప్పుడు సుమారు ఇరవై అయిదేళ్ళుం దాలి- అవునా?"

"ఎస్సార్. మొన్ననే ఇరవయ్యయిదు వెళ్ళేయి సర్."

"యువార్ సో లక్కీ- టు హావ్ హర్."

"నాకు మాట తోచనంత సంతోషంగా వుంది సార్, ఇవాళ."

"మూడేళ్ళయిందా. మీ పెళ్ళయి?"

"అవున్సార్."

"నువ్వు చాలా మంచిపని చేశావు. ఆమెని మారేజ్ చేసుకోడం. ఎందు కంటావా, అఫ్‌కోర్సు, నేను చెప్పకూడదనుకో-సరస్వతికి అంత అందం, అంత టాలెంటు వుండీకూడా. ఆ అందమే, ఆ టాలెంటే ఆమెకి శత్రువులై అదంతా అడివికాచిన వెన్నెల అయిపోతుందేమో అనిపించేయి. కొంతకాలం! దానికి తోడు కొన్ని అపవాదులు!..."

"అపవాదులేమీ లేవు సార్" అన్నాడు రామం, వొక అర్థం దిగమింగి.

"నువ్వలా అనుకోడం గొప్ప విషయం!...నేను కూడా నమ్మను. కాని, తొమ్మిది నెలలపాటు వొకసారి, ఏడాది పాటు రెండోసారి తను వూళ్ళో కని పించకుండా వెళ్ళిపోయినపుడు-ఏమీ సంబంధం లేకపోయినా-ఊరు ఊరంతా కూడా-ఆ సూర్యారావుతో లేచిపోయిందనీ. రామకృష్ణగారితో బెజవాడలో కాపురం పెట్టేసిందనీ పుకార్లు పుట్టించేసేరు. అఫ్‌కోర్స్-అదంతా నాన్సెన్సే. కాని ఎవరాలోచిస్తారలాగ? నువ్వు కాబట్టి-" అని కొంచెం ఆగాడు వాసవ. "ఐ డోంట్ మీన్ టు డిస్కస్ హర్ పాస్ట్...ఎక్కడున్నా తను సుఖంగా వుండడమే నాకిష్టం!" అని రామం కళ్ళలోకి చూశాడు.

"తమ రామెని గురించి ఎంతో దయగా భోగట్టా చేసేరని చెప్తాను సర్, చాలా సంతోషిస్తుంది!"

"ష్యూర్, ష్యూర్! నేనామెని అడ్మైర్ చెయ్యలేకపోయినా అభిమానించ గలను కదా!"

"అటువంటి భావం తప్పరితుండడం ఆమె అదృష్టం సర్"

"నా పెటాల్!...మీ రిద్దరూ కలిసి వోసారి మా యింటికి రాకూడదూ? అఫ్‌కోర్స్-రేపాదివారం మళ్ళీ ఆదివారం నాకు ఖాళీ లేదుగాని-ఆ తరువాతి ఆదివారమయితే నాకు సంతోషం, సదుపాయం కూడాను. ఈవినింగ్ టైమ్ రండి. అక్కడే భోంచేసి, మర్నాడు మాణింగే వెళ్ళిపోవచ్చు."

"అలాగే సార్" అని లేచాడు రామం.

"అలాగే అని నువ్వు మాటిచ్చేడం కాదు. ఆమెకేం యిబ్బందుంటుందో!...యు ఫిక్సప్ విత్ హర్ అండ్ రింగ్ మి అప్"

* * *

అలిసిపోయి నిద్రపోతోంది సరస్వతి. ఎన్నిసార్లు ఎంత నిదానంగా చూసినా ఇంకా ఏదో కొత్త అందం, వింత గ్లామరు కనబడతాయి, ఆమెలో రామానికి. ఎక్కడా యెవరితోనూ పెళ్ళంటూ కాకండా, అక్షరాలా వైవాహిక జీవితం గడపవలసి రావడంవల్ల చింతతో కొంత వాడిపోయి వుండవలసింది. కాని సంగీత సాధన యిచ్చిన ఆరోగ్య లావణ్యాలు, ఆ జ్ఞానం యిచ్చిన బలం ఆమె మైమెరుపుకి కారణాలై వుండొచ్చు.

మళ్ళీ ఆమెని దగ్గిరికి తీసుకున్నాడు రామం. పరవశపు పరాకాష్ఠను సూచించే సుప్తదరహాసంతో సరస్వతి అతని వీపుమీద చెయ్యివేసి దగ్గరగా జరిగి, పెదవులు కలిపింది, నిద్రపోతూనే. అది నిద్రకాదేమో, ఆ ముద్దు మెలకువలోదేనేమో అని ఆశపడ్డాడు రామం.

"సరూ!"

సరస్వతి కళ్ళు తెరవలేదు! పిలుపు విన్న చిహ్నమే లేదు

అలవాటయిన వాసనను ఆమోదించడానికి, ఆ భావాన్ని అభావసిద్ధంగా చెప్పడానికి. జాగ్రత్స్వప్న సుషుప్త్యావస్థల భేదాన్ని పాటించదు కాబోలు, మానవ శరీరం-అనుకున్నాడు రామం.

నిద్రే. మరి మాట్లాడదీ రాత్రికి. లేపి మాట్లాడించడం అంత మంచిది కాదు.

* * *

నాలుగేళ్ళ కిందట రామకృష్ణగారి సంగీత కచేరీలో చూశాడు రామం సరస్వతిని మొట్టమొదటిసారి.

కంపెనీ వార్షికోత్సవానికి ఆమె కచేరీ యేర్పాటు చేయాలని విజయవాడ వెళితే, "గుంటూర్లో ప్రోగ్రాములో వుంది. అక్కడికెళ్ళి మాట్లాడ్డం మంచి" దన్నారు: గుంటూర్లో కచేరీ వినబడింది. కనబడింది; కాని, మాట్లాడడానికే వీలుపడ లేదు. మర్నాటి ఉదయమే వాళ్ళు నాగార్జునసాగర్ వెళ్ళేరని తెలిసి, తరువాతి బస్సెక్కి సాగర్ వెళ్ళాడు రామం.

అక్కడ కచేరీలేదు. అది రామకృష్ణగారితో విహారయాత్ర.

గెస్ట్‌హౌస్ వరండాలో అడ్డేశాడు రామకృష్ణగారు. "కచేరీ విషయం ఆవిడ్తో కాదు, నాతోనే మాట్లాడాలి, ప్రస్తుతం ఆమె నా భార్య" అంటూనూ.... లలితసంగీత కచేరీకి ఆమె వొక్కతెనూ పంపడానికిగాని, యుగళగీత మంజరి నిర్వహించడానికి తను కూడా రావడానికిగాని, రామం యిచ్చిన తేదీ ఎంత మాత్రం నప్పలేదన్నాడు.

ఆ తరువాత యేడాదికి తన భార్య లక్ష్మికీ తనకీ సరిపడక పోవడం. విశాఖపట్నంలో ఆమె చేస్తున్న వుద్యోగం వదిలి తనతో రాజమండ్రి రావడానికి ఆమె నిరాకరించడం జరిగాయి.

మామగారు జబ్బు మనిషి. వీళ్ళతోనే వుండేవాడు, బావమరిది ఊళ్ళోనే వున్నా, అతనెప్పుడు ఆ యింటికొచ్చినా తండ్రిని తనతో తీసుకుపోవడానికి ఉద్దేశం ప్రయత్నం పెట్టుకునే వొచ్చేవాడు. ఆయన పెన్షన్ అరువందలు, మరి!... ఆయన రిటైరవగానే కొన్న యింటిఖరీదుకి ఆయన ప్రావిడెంటుఫండూ అవీ సరిపోనప్పుడు, రామం, తన పిత్రార్జితం పూర్వార్జితం అంతా పదివేల పైమాట– ఆ యింటికే పెట్టాడు.

"మీరు వొకందుకు నేనూ, మరొకందుకు మా నాన్నగారూ కావాలి. మీ భార్యని కాబట్టి నాకు మీతో రాకతప్పదని, నా మీది ఆపేక్షచేత మా నాన్నగారూ మీతో వచ్చి తీరతారని మీ అభిప్రాయం. ఆయన పెన్షన్ డబ్బులకి ఆశపడ్డంలో మీరూ మా అన్నయ్యా ఒకరికొకరు తీసిపోవడంలేదు. ఆయన మాత్రం ఇంత పెద్ద ఆస్పత్రివున్న ఈ వూరువదిలి, అల్లుడుగారికి వుద్యోగంకదా అని రాజమండ్రి వొచ్చెయ్యలేరు!" అంది లక్ష్మి.

"నాకోసం నువ్వు మీనాన్నని వదల్లేవు. ఒకవేళ వదలగలిగినా నీ వుద్యోగం మాత్రం వదల్లేవు. ఆ సంగతి నాకు తెలుసు. కాని నాకన్నా ఓ వంద రూపాయలు ఎక్కువ జీతం తెస్తున్న పెళ్ళానివి కదా అని నీకోసం అర్రుస్సు కాద

నడం నా పద్ధతికాదు. మీఅన్నయ్య దఖలుపరుచుకున్న మీ అమ్మగారి బంగారం, ఆవిడ చేత మీ అన్నయ్య తనపేర రాయించుకున్న యింటిలో సంగోరు వాటా, మీ నాన్నగారు నా డబ్బు పోసి కొన్న యిల్లు, ఆయనగారు రేపో నేడోకమ్యూట్ చేయించుకుందామనుకుంటున్న పెన్షన్ మొత్తం, వీటిమీద ఆశకూడా నిన్నిక్క-ణ్ణుంచి కదలనివ్వదు కనక, నువ్విక్కడే వుండు!"

ఆ తరవాత ఎప్పుడు విశాఖపట్నం వెళ్ళినా, లక్ష్మిని కలుసుకోడం- అడ్వకేట్ల ఆఫీసుల్లోనే, మధ్యవర్తుల ముందువాళ్లోనే!

రాజమండ్రి చేరాక కంపెనీ వార్షికోత్సవాల సందర్భంగా సోలో కచేరీ కొచ్చిన సరస్వతికి వసతి, ఆతిథ్య సౌకర్యాలు చూడవలసిన పనిలో, ఒకే రోజున పదిహేను గంటలపాటు ఆమెతో వుండగలగడంతో, అతనికామెమీద వున్న అభిమానం అడ్మిరేషన్ ఆమె మనసు కెక్కే విధంగా చెప్పగలిగాడు రామం.

ఆ తరవాత పదిరోజులకి కాకినాడలో ప్రోగ్రాం వుందని. అక్కడికి రమ్మంది సరస్వతి.

"రామారావుగారు- మా శ్రీవారు- కె. అండ్. జె. కంపెనీలో ఆఫీస్ సూపరింటెండెంటుగా వున్నారు. సంగీతవిమర్శకులు, మధుర గాయకులున్నూ" అని అక్కడి వాళ్ళకు పరిచయం చేసింది.

"వాళ్ళెవరికో మా వారంటూ పరిచయం చేసేనుకదా అని మీరేం నాకు పుస్తి కట్టనక్కరలేదు. కలిసి వుందామని మనం ఒకరి చేతుల్లో మరొకరు చేతు లేసి వో మాట అనుకుందాము. అది వివాహ బంధాన్ని మించిన స్నేహమని నా ఉద్దేశం. నా సంగీతానికి భంగంరాకుండా నాకు తోడుగా వుంటానంటేచాలు. నా శరీరం, మనసు, ఆదాయం ఆనందం అన్నీ మీవే—" అని ఆ రాత్రి గెస్టు హౌసులో బయటపడ్డ సరస్వతి అభిప్రాయమే తామిద్దర్నీ వొకటి చేసింది.

* * *

హఠాత్తుగా లేచి కూర్చుంది సరస్వతి.

రామం మేలుకొని వుండుంటాడని స్ఫురించినట్లు, అతనివేపు చూడ కుండానే. చెదిరిన ముంగురులు తొలగిన వస్త్రాలు సరిచేసుకుని మంచం దిగింది. "జాగర్త" అన్న హెచ్చరిక విని రామం వేపు చూసింది. "ఇంకా నిద్ర పోలేదా మేష్టారూ!" అంది నవ్వుతూ అతని మీదికి వొంగి.

రామం "శ్రే" అన్నట్టు తలపూపాడంతే,

విశాలమైన హాల్లాంటి ఆ గదిలో. వొక మూలగా కట్టించిన ముప్పయి అయిదు చదరపుటడుగుల వేదిక చేరిందామె. తంబురాకీ సరస్వతి పటానికీ నమస్కారం చేసి, కాళ్ళు శుభ్రంగా కడుక్కొని వేదిక యెక్కింది. తంబురా శృతిచేసి "ఇడుగో, మేష్టారూ!" అంది.

రామం కూచ్చున్నాడు.

తంబురా నాదం ఒక్క క్షణం ఆపింది సరస్వతి—"నీలాంబరి రాగంలో ఒక కొత్త ప్రయోగం కోసం సాయంకాలం నుంచీ తపన పడుతున్నాను. చిన్న ఆధారం దొరికినట్టుంది. పాడుతాను వినండి" అని, గమపసనిప సనిసమ గమ రిగమ రిగరి సామా; అనే ఆధారంలోంచి నవ్యనాదాన్ని సృజించే ప్రయత్నంలో పడింది.

అది సాధన—

అది తపస్సు—

సమయం మంచిదేగాని తరుణం గొప్పది యిది, కల్ప వృక్షం కిందికి చేరి కప్పు కాఫీ అడిగినట్టుంటుంది, ఇప్పుడు ఎంత పెద్ద లౌకిక విషయం గురించైనా చేసే చర్చ, ప్రార్థన..

ఉచితం కాదు.

"రిసనిప సనిపమ గమపా" చిరునవ్వుతో హస్తవిన్యాసం చేసింది సరస్వతి.

రామం తలపూపారు.

"రిసనిప సనిపమ గమపా—

గమ పపనిస సనిపమ గమ రిగమ రిగరి సామా"

"ఔను!" అన్నాడు రామం; ఆమెని చూస్తూ ఆమెలోకి చూస్తూ, తల వూపుతూ.

—నీ భార్య గతాన్ని గూర్చి చర్చించడం నా కిష్టం లేదు. అన్నాడు. ఎమ్ డి. వాసవ....బాగానే చెప్పాడు, తన మనసులో కోరిక-ఒక్క పొరపాటు మాటకూడా రానివ్వకుండాను.

"రీసనిప్ప సానిపాప్ప పానిపామ గామపాగ—

—మా వూరమ్మాయే. ఇంతప్పటినుంచి యెరుగుదును. ఆ రోజుల్లో

ఎనభై రూపాయలు పెట్టి తంబురా కొనిచ్చాను!—అని తన అర్హతను ప్రతిష్ఠించాడు.

"సారిసాన్ని సానిసాప్ప పానిపాప పామగామ"

"కాలం" మారుతోంది....శభాష్?" అన్నాడు రామం.

సరస్వతి తల నిలువుగా ఆడించింది.

"రీసనిప్ప సానిసాప్ప పానిపామ పామ దాప్ప రిగమ రిగరి సామా"

—అందమే, టాలెంటే ఆమె శత్రువు లౌతాయని, ఆమె సౌందర్యం అడవి కాచిన వెన్నెల అయిపోతుందని భయపడ్డానని అంత సౌందర్యవతిని పొందిన తన అదృష్టాన్ని మెచ్చుకున్నట్టుగా ఆమె అందాన్నే మెచ్చుకున్నాడు.

"గామ పని ససనిప నినిపమ పపమగ మమగస- రిగమ రిగరి సామా"

—అపవాదులు బయలుదేరేయని చెబుతూనే అవి ఎంత సమంజసమైనవో వినరిస్తూ ఆమెని తనుకూడా కోరడంలో తప్పులేదని స్ఫురింపచేసేడు. కొత్త వుద్యోగాన్ని సాధించడానికి అత్యవసరమయ్యే అధికారిక గ్రంథాలను అడక్కుండానే యిచ్చి ఈ ప్రయత్నంలో తన సహకారం వుండగలదని సూచించేడు.

"మొన్న రాజారావుగారు రాసిన పాటకి ఈ రాగంలో ఈ మనోధర్మం లోంచి ట్యూను కడదాం మేష్టారూ!"

"అలాగే"

"ఆ సాహిత్యం కొంచెం కాపీ చేసివ్వరూ, ఆయన దస్తూరీ నాకు బోధపడదు!"

"నేనది కాఫీ చేస్తాను కాని, నువ్వు ఏమనుకోకుండా లేచి నాక్కొంచెం కాఫీ చేసిద్దూ, తల నొప్పుంది!"

"అయ్యో-! చెప్పేరు కారేం?"

సరస్వతి చప్పున వేదిక దిగింది. బైండు పుస్తకం, అందులో ఏర్పాటుగా పెట్టిన కాగితం, కలం, అతని కందించి వంటగదిలోకి వెళ్ళింది.

మంచంమీద కూచ్చునే, తలాపిన రెండుదిండ్లు పేర్చి ఒళ్ళు విరుచుకుని, కలం పక్కనపెట్టి. కాగితం యెగిరిపోకుండా బైండు పుస్తకాన్ని దానిమీద పెట్టి, చేరబడ్డాడు రామం.

వెలిగించిన గాస్‌స్టవ్‌మీద పిడికెడు ఆకాశంలా కనిపించే నీలిమంటమీద ఖాళీ గిన్నెపెట్టి, చేతికందిన గ్లాసు పరిశుభ్రంగా లేకపోతే ఒకసారి తొలిచి,

అరగ్లాసుడు నీళ్ళు పోసిందందులో సరస్వతి. ఇష్టంలేని పని చెయ్యటానికి తప్పనిసరై వొప్పుకునే మనిషి మనసులా చుంయ్యిమంది గిన్నె.

–అర్థంకాదా,? లేక అర్థంకావడానికి లోపలేమీలేని మూర్ఖుడా? అనుకుంది రామాన్ని తలచి.

ఆనాడు–

టెంపరరీ ఖాళీలో ఇక్కడ సూపరింటెండెంటుగా చేరిన కొన్నాళ్ళకి బిజినెస్ మేనేజరు ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాడు రామం, వాసవ సలహామీద. రామకృష్ణగారితో తెగతెంపులు చేసుకొని కొత్తగావచ్చేసిన రోజులు. కాకతాళీయంగా ఎక్కడో ఎదురై తనని గుర్తుపట్టి పలకరించిన వాసవ, అఫీసు వేళల్లో సరాసరి తన దగ్గిరికే వచ్చేసేవాడు. అతనికి బి, ఎమ్. ఉద్యోగం రావాలంటే అది నా చేతుల్లో పని! అంతేకాదు, నీ చేతుల్లో పనికూడాను." అన్నాడు.

"నువ్వంటే నాకెన్నాళ్ళనించి, ఎంత అభిమానమో, ఎంత తమకమో, ఎంత ఆరాధనో-నీకు తెలుసా!"

"మన్ం మనం ఒక వూరివాళ్ళం. ఒకరి ఆశలు నెరవేరడానికి మరొకరు, ఒకరి కోరికలు తీరడానికి రెండోవారు సహకరించుకుంటాం. యిందులో తప్పేముంది?"

"రామానికి లైఫ్‌లో ఇదొక టర్నింగ్ పాయింటు, సరైన నిర్ణయం తీసుకుని అతన్ని నువ్వు ఆదుకోకపోతే ఇదే అతనికి రిటర్నింగ్ పాయింటు అయిపోతుందికూడానూ."

"నన్ను నిరుత్సాహపరిచి ప్రయోజనంలేదు, పైగా నష్టం !....ఈ ఇంటర్వ్యూ నేను జరపను-అని వొక్క ముక్క రాసేస్తే నా బదులు వైజాగ్ నుంచి పర్సనల్ మేనేజరు రంగనాథయ్యరుగారువొచ్చి ఇంటర్వ్యూ జరుపుతాడు. అతనే ఇంటర్వ్యూ చేస్తే ఇతనికి బి.ఎం. ఉద్యోగం ఇవ్వడు సరికదా, ఈ సూపరింటెండెంటు ఉద్యోగానికికూడా ఎసరుపెట్టి వెంటనే సైపిస్టుగా విశాఖపట్నం పంపేసే ఏర్పాటు చేసేస్తాడు. ఇతనక్కడ చేసేది చిన్న ఉద్యోగమే అయినా,ఆ వూళ్ళో యితనికి, ఉద్యోగం చేస్తున్న పెళ్ళాం, నెల కారుపందలు పెన్షన్ తెస్తున్న మామగారు, ఓపెద్ద బంగళాలో సగం వాటా పంచిపెట్టడానికి సిద్ధంగా వున్న బావమరిదీ వున్నారు కనక వెళ్ళిపోతాడంతే! అతనికి ఈ వూళ్ళోనేయింతకంటే పెద్ద వుద్యోగం వొస్తేనే నువ్వీమూరైనా లైఫ్‌లో సెటిలవగలవని నీకుతెలీదా? నా పద్ధతి అంతా లివ్ అండ్ లెట్ లివ్!"

నవ్వేడు, లాలించేడు. బుజ్జగించేడు-బెదిరించేడు. ప్రలోభ పెట్టేడు-చివరికి సాధించేడు!

-అంతా వారం రోజుల్లో అయిపోయింది. విజయనగరంలో గురువు గారికి వొంట్లో బాగులేదని, చూసి రెండు మూడు రోజుల్లో వచ్చేస్తానని తను రైల్లో బయలుదేరింది. వాసవ కార్లో సామర్లకోట జంక్షన్ దగ్గిరకొచ్చి తనని కలుసుకున్నాడు.

....ఒక ఆలాపన సక్రమంగా నడవకపోతే - ఒక గమకం నపకం చెడి తికమక పెడితే, అవేవో తనకే వొచ్చిన చిక్కులుగా భావించి తన అల్లకానికి అందింపును సమకూర్చే రామం-ఇప్పుడు తన "మనోధర్మా" న్నెరిగిన మంచి మిత్రుడు....నిస్సంశయంగా యితనికున్నది నా దేహం మీది ప్రేమ కాదు-అత నికి తన దేహం మీదనే తన సుఖం మీదనే మమకారం వున్నట్టు కనిపించదు! అందుచేతనే కాబోలు-ఆతనికి అసూయలేదు!

సూర్యారావు, రామకృష్ణ తనని అసూయచేతనే దూరం చేసుకున్నారు. తనమీద ఎవరైనా-కాంక్ష చూపడందాకా యెందుకు కన్ను తిప్పితేచాలు; వాడెవడు, వాడు నీవేపు ఎందుకలా చూస్తున్నాడు; అన్న ధోరణిలో తనని వాదులు కోవడానికే ఎప్పుడూ సిద్ధంగా వుండేవారు. తనమీద వాళ్ళ అనుమానాలు, నిఘాలు-తల్చుకుంటేనే రోతగా వుంటుంది!

ఎం. డి. వాసవ బంగళాకి వెడితే నేను నేనుగా తిరిగి రాలేనని తెలిసి రమ్మంటున్నాడో, తెలియక రమ్మంటున్నాడో - తెలిసి రావడంలేదు!.... "భోజనానికి" రమ్మన్నాట్ట; రాత్రంతా వుండి తెల్లారి వెళ్ళమన్నాట్ట! - అపర వాసవుడు!

కాఫీ పట్టుకుని పడక గదిలో కెళ్ళింది సరస్వతి.

రామం నిద్రపోయినట్టు కనబడ్డది. లేపాలా వద్దా అని సందేహిస్తూ నిల బడింది.

కాఫీ చల్లారిపోతోంది....వేడిగా తాగుతాడు.

చప్పున నిర్ణయించింది. గోడ అలమారులో మాత్రతీసి, తొడుగు వొలిచి సిద్ధం చేసింది, మాత్ర దిగటానికి మంచినీళ్ళూనూ.

"మేష్టారూ!"

"ఊఁ-"

"లెండి; కాఫీ తెచ్చేను!"

"అలమర్లో మాత్ర వుందేమో, చూడు!"

"ఉందనే తెచ్చేను."

నిశ్శబ్దంగా కూర్చుంది సరస్వతి. సమస్యని అణువణువూ చీల్చి, నమిలి మింగి జీర్ణం చేసుకుంటున్న పద్ధతిలో- చెమ్చాతో భాగాల చొప్పున, చుక్కల చొప్పున- అరగ్లాసు కాఫీని ఐదునిమిషాలు తాగింది.

"టైమెంతైంది?" రామం కళ్ళు తెరవకుండానే అడిగాడు.

"ఆదివారంలో కొచ్చేసేం-"

పాత కాపీ చెయ్యడానికి తగిలించుకున్న కళ్ళజోడు ఎడంచేత్తో తీసి అందించాడు. తన కళ్ళూ, మొహమూ సరస్వతికేం చెప్పిపోతాయో అన్న భయం వున్న వాళ్ళాగ మొహంమీద తువ్వాల్ని వో నిమిషంపాటు నడిపాడు.

సరస్వతి నవ్వింది. లేచి బట్టల స్టాండుదాకావెళ్ళి, పాంటూ షర్టూ తెచ్చి, మంచం పక్కని నిలబడి "లేవండి" అంది.

చూశాడు.

"వైజాగ్ వెళ్ళండి; ఇంకో గంటలో బస్సుంది."

"........"

"మీ మామగారు పెన్షన్ కమ్యూట్ చేసిన డబ్బు నిన్న తీసుకునుంటారు. అక్కయ్యగారు డబ్బు రేపు బ్యాంకులో వేసేకుండా ఆఖరు ప్రయత్నం చేసి అక్కడో. మరో చోటనో వో అయిదువేలైనా తెచ్చుకోండి."

బట్టలందుకుని. లేవకుండా అలా మళ్ళీ చూశాడు లోతుగా.

సరస్వతి ట్రంకు పెట్టెలు పేర్చిన చోటికి వెళ్ళింది. పైన వున్న బ్రీఫ్ కేసు తెరిచి, మరో జత బట్టలూ, కొన్ని వస్తువులూ అందులో సర్దింది. "వాన పడితే సంపదలూ, భోగాలూ అమృతమూ కూడా యిష్టమే, మిగిలిన ఆనందాలతో పాటు!....డబ్బుంటే యెన్నైనా కొనుక్కోవచ్చుగా!"

"పుచ్చుకుంటా డంటావా?"

"అక్కయ్యగారు మీకిస్తారా, అన్నది కదా, ప్రశ్న యిప్పుడు!"

"అదీ నిజమే."

"లేచి వెళ్ళండి మరి!"

"ఇంతా కష్టపడి తెచ్చేక అతను పుచ్చుకోనంటే?

"పుచ్చుకుంటాడని మీకు తెలుసు, నాకు తెలుసు! వెనక మీ కొలీగ్ నరసింహారాజుకి హైద్రాబాదుకి ట్రాన్స్ఫరు కావాలంటేను, మీ స్టెనో రీటాకి కన్ఫర్మేషను కావాలంటేను మీరే వాసూలుచేసి ఇచ్చేరు కదా!"

"అందరిదగ్గిరా పుచ్చుకుంటూనే వున్నాడనుకో.... మన దగ్గిర అతను కోరింది మరో పేమోననీ-డబ్బు పుచ్చుకోడేమోననీ—"

"అతను మీ దగ్గిర డబ్బు పుచ్చుకోకపోతే మీరు ఇలాగే బిజినెస్ మేనేజరుగా కొనసాగుతారు"

"అదే బావుందంటావు?"

"అనే, నేననుకుంటున్నాను!" అంది సరస్వతి.

అప్పటికీ అతను బట్టలు తొడిగేసుకుని తల దువ్వుకుంటున్నాడు.

సరస్వతి ట్రంకుపెట్టె తెరిచి అందులోంచి అతని పర్సుతీసి అందిస్తూ "వొక మాట అనుకున్నాం.... మొగవారు మీరే తప్పలేదు ఆ మాటకి, నేను మాత్రం యెందుకు తప్పాలి?" అంది; అతని కళ్ళలోకి చూడకుండాను.

రామం ఆ మాటకి సంతోషించలేదు. కనీసం అలా అన్లేదు. బ్రీఫ్కేసు తీసుకుని "వస్తా"నన్నైనా చెప్పకుండా వెళ్ళేడు.

"కొన్ని పన్లు-

చెయ్యడం కన్నా-

చెప్పడమే కష్టమన్న మాట!...." అనుకుంది సరస్వతి.

* * *

సోమవారం ఉదయం ఎనిమిది కాకుండానే రామం యిల్లు చేరాడు. తలుపు వోరవాకిలిగా తెరిచివుంచి. సరస్వతి మంచంమీదుంది. మూడురోజుల్నుంచీ నిద్రపోతున్నట్టు మొహం బాగా పొంగుంది.

"సరూ."

"ఒచ్చేరా?"

"అరగంటయింది, వూళ్ళో దిగి, సరాసరి ఎమ్. డి. గారి బంగళాకెళ్ళేను. అక్కడ పని అయిదునిమిషాల్లో అయిపోయింది. అయిదువేలు ఇచ్చెయ్యబోయాను. రెండువేలే చాలన్నాడు. పనైపోయినట్టే," అంటూ మంచంమీద కూచుని ఆమెని తన శరీరంతో అభినందించబోయాడు.

"ఆగండి" పేలవంగా నవ్వింది సరస్వతి "పాచిమొహం నేనూనూ!....

స్నానం చేసొస్తాను.... ఫ్లాస్కులో కాఫీ వుంచేను తాగండి.... ఇవాళేగా ఇంటర్వ్యూ?"

"ఏం యింటర్వ్యూ, నా మొహం! అంతా లక్ష్మీకటాక్షమేగా,"

"కాదులెండి. సరస్వతీ కటాక్షం కూడా లేకపోలేదు"

"లేదు. లక్ష్మి సమయానికి డబ్బివ్వకపోతే యిదేదీ అవదు!"

"నే అన్నది అదికాదు. ఇంటర్వ్యూకి పిలిచిన ఆరుగుర్లో మిగతా అందరి కన్నా మీరే ఎక్కువ చదువుకున్న వారుకదా." అని బాత్‌రూంవేపు కదిలింది సరస్వతి.

"అదే నిజమే అనుకో," అంటూ రామం ఆమె వెంట నడిచాడు.

బాత్‌రూమ్‌లో దూరి తలుపు గడియ వేసింది సరస్వతి అతన్ని అంత వెంటనే భరించలేక.

రెండు నిమిషాలు తలుపు ఒడ్డునే నిలబడితేగాని ఆమెకి బలం రాలేదు, స్నానం చెయ్యడానికి కూడానూ.

***